# అస్తంగతుడైన సూరీడు

ఓ ప్రభుత్వకార్యాలయంలో ఓ అటెండరుగా పనిచేస్తున్న వీరాస్వామి; ఓ లాండ్రీకెళ్లి, "వోరేయి సూరీడు!.... కొత్తగా వచ్చిన మా ఆఫీసరు పోతరాజుగారు, మాపాతాఫీసరు సన్నాసి రావులాంటోరు కారు!.... పుచ్చుకోడంలోను, యిచ్చుకోడంలోను మహోదర్జాఅయినోరు! ... పువ్వుపుట్టగానే పరిమలిస్తాదన్నట్లు; అయ్యగారాఫీసులో అడుగెట్టగానే ఆఫీసంతా గుమగుమలాడిపోనాది. మాగుండెలానందంతో గుబగుబ లాడిపోనాయి!.... ఇంతకి యిప్పుడు నేను నీకాడకెందుకొచ్చేనంటే; అమ్మగార్కి మాసినబట్టలింట్లో వుంటే మహ సెడ్డ సిరాకట!.... అంచేత అర్జంటుగా ఓలాండ్రీవోడిని లాక్కు రమ్మని అమ్మగారు తగిలేరు నన్ను. మా ఆఫీసుకి, ఎవురాఫీసరుగావొచ్చినా మరి నువ్వేకదా వారిబట్టల్ని వుతకడానికలవాటు పడ్డోడివి!....నీకీ వూళ్లో ఆఫీసర్ల లాండ్రీవోడివనే గొప్పపేరుటున్నాది! .. గనుక నువ్వర్జంటుగా మా ఆఫీసరుగారింటికెళ్లు. మా పాతాఫీసరుగారు కాళీచేసేసినింట్లోనే, మాకొత్తాఫీసరు పోతరాజుగారుకూడా దిగినారు. నిన్ననే వారు వారివైఫ్‌గార్ని తీసుకొచ్చినారు, అయమ్మగారుకూడా చాలామంచోరులాగే కనిపిస్తన్నారు !.... నేనిలా బజారుకెళ్ళి, వారు కొనుక్కురమ్మన్న సామాన్లన్నీ కొనుక్కొస్తాను. మరి నువ్వేమో ఆలస్యంసెయ్యకుండా అర్జంటుగా మాఆఫీసరు గారింటికెళ్ళు. ఇప్పుడింటికాడ అయ్యగారు లేరుగాని, అమ్మగారున్నారు. వారునీకు బట్టలేస్తారు బేగెళ్ళు" అని చెప్పి బజారుకెళ్లిపోయేడు.

సూర్యుడస్తమిస్తూంన్న సమయంలో, సూరీడు ఆ ఆఫీసరు గారింటికెళ్ళేడు.

సూరీడును చూసి, "ఎవరునువ్వు?" అనడిగింది ఆ ఆఫీసరు గారి భార్య లక్ష్మి.

"ఓ లాండ్రీ ఓనర్ని. మా అటెండర్ వీరాస్వామి, నన్ను మీయింటికెళ్ళమనిచెప్పి, తాను బజారుకెళ్ళేడు." అని సమాధానమిచ్చి ఆమెను పరిశీలనాత్మకంగా చూడసాగేడు సూరీడు.

ఎడంచేతికి అరువేళ్ళు. రెండుబొటనవేళ్ళు. ఆమె ముఖవర్చస్సు, శరీరవర్ణం, పలువరుస, ముక్కుతీరు చూస్తూంతే; చాలాకాలంకిత్రం బొబ్బిలి కాలేజీలో తనకు పరిచితమయిన 'లక్ష్మి' స్మృతిపథంలో మెదలింది! ఆమెనేఅడిగి సందేహానివృత్తి చేసుకోవాలని మొదటు ఉబలాటపడ్డా, ఎట్లాగో నిగ్రహించుకున్నాడు. ఒకవేళ ఆమె తానసుకున్న లక్ష్మికాకపోయినట్లయితే, తనట్లా అడిగినందుకామె ఆగ్రహించవచ్చు!....ఒకవేళ ఆమె తాననుకున్న లక్ష్మేఅయినా: ఆమిప్పుడు ఓగొప్ప ఆఫీసరుగారి భార్య! హోదారీత్యా తమమధ్య నేడుగల అంతరం, గణనీయమయినంత అధికంగావుంది. అంచేత ఆమెగురించి తను తెలుసుకోకపోవడమే ఉత్తమమనుకున్నాడు సూరీడు.

మాసినబట్టల పెట్లోంచి బట్టల్ని బయటుకుతీస్తూ, "సాధారణంగా లాండ్రీవాళ్ళు, మొదట్లో బట్టల్ని బాగానే వుతుకుతారని నాకు తెల్సు!.... కాని రాను రాను......" ఆమె చెప్పదల్చుకున్న విషయం యింకా పూర్తి కాకముందే,

"సరిగ్గావుతకరు!" అని కొంచెంసేపాగి, మాసినబట్టల్ని వేటికవిగా ఏర్చుతూ, "ఇది పాలిష్టర్ వస్త్రయుగం !....

ఇట్లాంటి విలువైన దుస్తుల్ని సాధారణంగా బట్టలంటే బొత్తిగా లక్ష్యంలేనివాళ్ళు తప్పితే, కొద్దో గొప్పో లక్ష్యమున్నవాళ్ళెవ్వరూ, లాండ్రీవారికి వుతికేటందుకైవెయ్యరు!" అనిఅన్నాడు సూరీడు.

సూరీడల్లా అనేసరికి, లక్ష్మి అతని ముఖంలోకి ఓసారి పరిశీలనాత్మకంగా చూసింది.

ఎక్కడో చూసిన ముఖంలాగేవుంది. ఎక్కడచెప్మా?.........సరిగ్గా గుర్తురాలేదామెకు.

"నీ పేరేఁవిటి?" అనడిగింది లక్ష్మి పద్దుపుస్తకం తెరుస్తూ.

"సూరీడు!'' అని సమాధానమిచ్చేడు.

సూరీడు !!!.... ఈ పేరు తను విన్నదే! ఎక్కడచెప్మా? ... తను బొబ్బిలిలో ఇంటర్ సెకెండియ్యర్ చదువుతూండే రోజుల్లో - ఓ కాలేజీఫంక్షన్‌లో, "పైమెట్టు'' అనే ఓనాటకంలో హీరోపాత్ర ధరించి, ప్రథమ బహుమతిపొంది, ఆనాడు పలువురిచే ఎంతో ఘనంగా ప్రశంసించబడ్డ వ్యక్తేనా ఈసూరీడు?. ఆనాటకాన్ని తానీనాటికీ యింకా మరచిపోలేదు. పైమెట్టుమీదున్న "తార"ను చేరుకోబోయి, క్రిందిమెట్టు దగ్గర తారయొక్క ఆత్మీయులచే ఎంతో నీచంగా అవమానింపబడి, పరాభవింపబడడంతో — ఇహచేసే దేఁవీలేక వెనక్కు తిరిగి అవమానభారంతో క్రుంగిపోతూ నిశ్శబ్దంగా అతగాడు వెళ్లిపోతూంన్న సమయంలో; అస్తమిస్తూంన్న సూర్యుణ్ణిచూస్తూ పైమెట్టుపై నిస్సహాయంగా తార కూలబడడంతో నాటకం పరిసమాప్తమవుతుంది!... ఆనాడు తానుచూసిన 'పైమెట్టు' నాటకంలోని హీరోవే ఈనాడు తమింటికి తమముర్కిబట్టల్ని వుతికే శుభ్ర

పరిచేటందుకొచ్చిన లాండ్రీ ఓనరా?.... తన యీఅనుమా నాన్ని నివృత్తిచేసుకొనే టందుకై, "నువ్వెంత వరకు చదువుకున్నావు?" అనడిగింది లక్ష్మి.

"బి. ఎ. వరకు." అని సమాధానమిచ్చేడు సూరీడు.

"బి. ఎ. ప్యాసయేవా?" అనడిగింది.

"లేదు. ఇంగ్లీషు తప్ప మిగిలినవన్నీ ప్యాసయేను. ఇంగ్లీషు వారు మనదేశాన్ని వదలిపెట్టిపోయినా, వారిభాష మాత్రం మనల్నింకా వదలిపెట్టిపోలేదు. కనీసం నేనయినా వారిభాష నొదిలి పెట్టేద్దామని, మరి పరీక్షకు కట్టడం మానేసి, స్వతంత్రంగా జీవించాలనే సంకల్పంతో ఓ లాండ్రీని నిర్వహిస్తున్నాను."

"ఏదైనా ఉద్యోగంకోసం ప్రయత్నించలేదా?"

"ఇదిమాత్రం ఉద్యోగంకాదా?.... పొట్టపోషణకోసం చేసే ఏపనైనా ఉద్యోగమేనని నాఉద్దేశ్యం!.... నాదృష్టిలో మనిషి యొక్క గౌరవం; అతడు చేపట్టే వృత్తినిబట్టికాక, అచేపట్టిన వృత్తికి అతడు చేకూర్చే ధర్మసమ్మతమైన న్యాయంపై ఆధారపడుంటుంది! ........ ప్రభుత్వంవారు స్వయంఉపాధి పథకం క్రింద నాకు బ్యాంకుద్వారా ఒసంగిన ఆర్థిక రుణసహాయాన్ని సద్వినియోగపరచుకొని, ఎంతోగౌరవప్రదంగా జీవిస్తున్నాను. నేటిమానవులు ధరిస్తూంన్న దుస్తులకంటుకొనే మళ్ళను; ఆధునిక విజ్ఞానజనితమైన సాధనాలతో చాలాబాగానే వదలగొట్టగలుగుతున్నాను. కాని నానాటికి మానవుల బుద్ధుల్లో పేరుకుపోతున్న కుళ్లును, ఎట్లా వదలగొట్టడమో నాకెకాదు; మహా

విజ్ఞాన విలసితులుగా ప్రఖ్యాతినొందుతున్న శాస్త్రవేత్తలకు కూడా అంతుపట్టడం లేదీనాటివరకు!" అని సూరీడనేసరికి,

సూరీడు ముఖాన్ని మరింత పరిశీలనగా వీక్షిస్తూ, "పై మెట్టు అనే నాటకంలో నువ్వు...... లక్ష్మి అడగదల్చుకున్న ప్రశ్న యింకా పూర్తి కాకముందే,

"క్రిందిమెట్టుదగ్గరే అడగింపబడి, ఘోరంగా అవమానింప బడి తరిమివేయబడ్డ హీరోను!" అని సమాధాన మిచ్చేడు సూరీడు.

"సూరీడూ!..... నువ్వు నన్నింకా గుర్తుపట్టలేదా?" అనడి గింది లక్ష్మి.

"గుర్తుపట్టేను. కాని మీరు " ఇంకా సూరీడు ఏదో అన బోతూండగా మధ్యలోనే అడ్డుతగిలి,

"నన్ను 'మీరు' అని మన్నించాల్సిన అవసరంలేదు." అనంది లక్ష్మి

"ఇప్పుడది సాధ్యపడదు. నేనిప్పుడు నాజీవనం కోసం చేస్తున్న వృత్తికి సంబంధించిన కొన్ని మర్యాదల్ని, లౌక్యాల్ని నేను పాటించక తప్పదు." అని అన్నాడు.

............గతస్మృతులు కొన్ని లక్ష్మి మనో అవనికపై విద్యు ల్లతల్లా మెరసినాయి. తన తండ్రి ఆరోజుల్లో ఓ లాండ్రీపెట్టి బాగా డబ్బు సంపాదించేడు. ఆ తరువాత అనేకరకాల వ్యాపా రాలుచేసి, చాలా ధనం సంపాదించేడు. డబ్బులోంచి డబ్బుని ఎల్లా పుట్టించవచ్చో బాగా అవగతంచేసుకున్నాక - బొబ్బిలి నుండి విశాఖపట్నానికి మకాం మార్చేసి, ఓ కంట్రాక్టరుగా ప్రఖ్యాతినొందేడు తనతండ్రి ! లక్షరూపాయిలు కట్నమిచ్చి,

తన వివాహాన్ని ఎంతోఘనంగాచేసేడు!.... కేవలం నెల నెలా వచ్చే జీతపు సొమ్మేకాక, అనేక యితరమార్గాలద్వారా లక్షల కొద్దీ ఆర్జించగలిగే వ్యక్తి తనకల్లుడయినందుకు, తన తండ్రి పొందుతూంన్న ఆనందానికి ఈనాటికీ అవధుల్లేవు!.... కాని భార్యపొందే ఆనందం, కేవలం భర్తసంపాదించే ధన సౌంద్రి తపైన ఆధారపడివుండదనే సత్యాన్ని తెలుసుకోడానికి, తనకు మాత్రిం అట్టేకాలం పట్టలేదు!.... అసలు మనిషిపొందే ఆనం దం భౌతిక మయినదా?.... ఆత్మ గతమయినదా?.... ఈవిష యంపై సూరీడుయొక్క అభిప్రాయం ఏమిటో?.... తెలుసు కోవాలనే కుతూహలంతో, "సూరీడూ ! .... మనిషిపొందే ఆనందం భౌతిక మయినదా ?.... ఆత్మగతమయినగా ?...." అనడిగింది లక్ష్మి

"ఆత్మజ్ఞానుల దృష్టిలో, ఆనందమనేది కేవలం ఆత్మగత మయినది కాని ఆత్మజ్ఞానశూన్యుల దృష్టిలో ఆనందమనేది కేవలం భౌతికమయినదే!....నేడు భౌతికానందంకోసం తాప త్రియపడుతున్నవారిసంఖ్యే ఈలోకంలో అత్యధికంగావుంది!" అని సమాధానమిచ్చేడు సూరీడు.

"ఆనాడు నువ్వు పైమెట్టు నాటకంలో ప్రిథమబహుమతి పొందినప్పుడు; ఆధునిక కవితాయుగ కర్తలలో ఒకరైన శ్రీ రాయప్రోలు సుబ్బారావుగారిచే రచింపబడిన లలిత, తృణ కం కణము అనే కావ్యాల్ని; నాప్రత్యేక బహుమతులుగా సభా ముఖంగా ప్రకటించి నీకు నేను అనాడిచ్చేను. నీ నటనకు నేనెంతో ముగ్ధురాలనై, ఎంతో ప్రేమతో నీకానాడు నేనిచ్చిన ఆపుస్తకాలు చిరిగిపోకుండా నీదగ్గరింకాభద్రింగావున్నాయా?" అనడిగింది లక్ష్మి.

"ఉన్నాయి. ఆకావ్యాల్ని ఆనాడు నాకు బహుకరించడం లోగల మీ అంతర్యాన్ని అవగతం చేసుకున్నాను!" అని ముక్తసరిగా సమాధానమిచ్చి, "అఁ!.... మాసిన బట్టలన్నీ వేటికవిగా ఎంపికచెయ్యడం పూర్తి చేసేను. ఇహ పద్దు రాసుకొండమ్మా!" అని అన్నాడు సూరీడు.

బట్టలపద్దురాయడం లక్ష్మిపూర్తిచేసింది.

సూరీడు మాసిన ఆబట్టలన్నిటిని ఓదుప్పటీలో మూటకట్టి, "ఇకనాకు సెలవిప్పించండమ్మా త్వరలోనే మీయీబట్టల్ని బాగావుతికి సాఫుగాయిస్త్రీచేసి తీసుకొస్తాను." అని అన్నాడు

"సూరీడూ !.... మనో నేత్రాలతో ఎదుటివారి మనస్సుని చదవగలిగేశక్తి కొంతమంది కుంటుంది. అట్టిశక్తి నీకున్నాదని నానమ్మకం!.... ఓ గొప్ప ఆఫీసరుగారి భార్యగా నాకి సమాజంలో గణనీయమైన సోషల్ స్టేటస్వుంటే వుండవచ్చు !.... కాని........" చెప్పడానికి సందేహించి, అర్ధాంతరంగాచెప్పడం ఆపుజేసిందామె.

"కాని ? .... మీకేఁవిటిలోటు?" అనడిగేడు సూరీడు తెలుసుకోవాలనే కుతూహలంతో

లక్ష్మి బాధగా నిట్టూర్చి, "నాకేఁవీ లోటులేదనే చాలామందియొక్క అభిప్రాయం!....బాబుగార్ని; అంటే నాభర్తని తెనాలి రామలింగకవి వ్రాసిన పాండురంగ మహాత్మ్యంలోని నిగమశర్మతోగాని, కందుకూరి రుద్రకవివ్రాసిన నిరంకుశోపాఖ్యానంలోని నిరంకుశుడితోగాని పోలిస్తే; వాళ్ళని అవమానపరచినట్లే అవుతుంది!.... నువ్వు చదువుకున్నవాడివి కనుకయింతకంటే వివరంగా నాభర్తగురించి నీకునేను చెప్పాల్సిన

అవసరం లేదు!....నాభర్త నుండి ప్రయోజనాన్ని ఆశించేవారు, అతనిలోని బలహీనతల్ని తమస్వప్రయోజనాల్ని సాధించుకొనేటందుకు, ఎంత అధికంగా వాడుకావాలో అంత అధికంగాను వాడుకుంటున్నారు!..... అతను యింటిదగ్గరకంటే, ప్రాంత ప్రముఖులు చేకూర్చే భోగభాగ్యాల్ని, భౌతిక సుఖాల్ని ఏబంగళాలోనో తనివితీరా అనుభవించడానికే బాగా అలవాటుపడ్డారు!" అని చెప్పి, కొంచెంసేపాగి, రుద్ధమవుతూన్న గొంతుకను సవరించుకొని, "సరే!..... నామాటకేంగాని, నువ్వు సుఖంగావున్నావా ?.... నీకు పిల్లలెందరు ?'' అనడిగింది.

"ఏం చెప్పమంటూరమ్మా?..... నన్ను తనదైవంగా భావించే నాభార్య 'జ్యోతి' ఓ మృత శిశువును ప్రసవించి, తను శాశ్వతంగా ఆరిపోయి నాజీవితాన్ని అంధకారమయం చేసివేసింది!" అని చెపుతున్నప్పుడు సూరీడు నేత్రాలు ఆర్ద్రమయినాయి. గొంతుక దుఃఖంతో బొంగురుపోయింది.

''అయ్యోపాపం!'' అని తన సానుభూతిని వ్యక్తంచేసి, కొంచెంసేపు మౌనంగావూరుకొని, ''ఇంతచిన్న వయస్సులోనే భార్యను పోగొట్టుకున్న నువ్వు: మరొకామెను యింకా వివాహం చేసుకోలేదా?" అనడిగింది లక్ష్మి.

''లేదు. నామనస్సుని, హృదయాన్ని దోచుకొని 'జ్యోతి' తనువు చాలించేసింది. నా హృదయంలో ఆమె వెలిగించిన జ్యోతి ఆరిపోతే, అప్పుడు నాబుద్ధి మార్చవచ్చేమో! అప్పుడు నామనస్సు మరోవివాహానికి అంగీకరించవచ్చేమో ! నాబాహ్య దృక్పథంలో జ్యోతి ఆరిపోయినా, నా అంతఃకరణలో మాత్రం

యింకా జ్యోతి ఆరిపోలేదు!" అని సమాధానమిచ్చేడు సూరీడు పొంగివస్తూన్న దుఃఖాన్ని దిగమింగుకుంటూ!

బయటకుబుకుతున్న తన మనసులోని భావాల్ని, పెదవులతో నొక్కిపెట్టడానికి కొంతసేపు ప్రయత్నించి, విఫలురాలై, "సూరీడూ!..... ఆనాడు నిన్ను నేను వివాహం చేసుకొనుంటే - నీజీవితంతోపాటు, నాజీవితంకూడా యీనాడెంతో ఆనందమయంగా ఉండివుండేదేమో !!" అని లక్ష్మి అనేసరికి సూరీడు నిర్ఘాంతబోయేడు.

ఆమె అట్లా అంటుందని అతననుకోలేదు. ఇహ ఏమనాలో అతనికి తోచలేదు! .. ఏదో అసహజమైన వాక్కు విన్నవాడిలా అనుభూతినొందేడు!.....

"ఆనందమనేది డబ్బులో వుండదని, మంచి మనసున్న మనిషి సహచర్యంలో వుంటుందని నానమ్మకం!" అని లక్ష్మి అంటున్నప్పుడు విద్యుత్ ప్రసారానికి ఆటంకం కలిగింది. దీపాలన్నీ ఆరిపోయేయి! మళ్లీ కరంటు వచ్చేసరికి చాలాసేపు పట్టువచ్చేమోవనే అనుమానంతో - టేబులుపైనున్న టార్చిలైటు కోసం ఆ గాఢాంధకారంలో తడుముకుంటూ మెల్లగా టేబులు కేసి నడుస్తూన్న లక్ష్మి చేతులకు సూరీడు పట్టుబడ్డాడు!— అనిర్వచనీయమైన మధురానుభూతిని ఆమె సూరీడు స్పర్శలో పొందింది!..... తన హృదయంలో దివ్యజ్యోతి వెలిగినట్లనుభూతి పొందింది.

సూరీడు వెనక్కి అడుగేసేడు !.... లక్ష్మిముందు కడుగేసింది !

పైమెట్టుపైనుండి ఆ ఉభయులలో ఏఒక్కరూ క్రిందకు జారి పడకముందే, మళ్ళీ కరంటువచ్చింది!....దీపాలన్నీ వెలిగేయి!

లక్ష్మి మెల్లగా వెనక్కుజరిగి, ఆ విద్యుద్దీపకాంతిలో సూరీడు ముఖంలోకి సిగ్గుపడుతూ ఒకరకంటిలోచూసింది. అతనిముఖంపై తననీడపడడం వల్లనో ఏమో; అతనిముఖం నల్లగామాడి పోయి నట్లుగుపించిందామెకు!

అంతట్లో అటెండర్ వీరాస్వామి, బజారునుండి సామాన్లు పట్టుకొచ్చి; సూరీడుకేసిచూస్తూ, "వొరేయి సూరీడూ!— బట్టలు బాగుతికి బేగొట్రా!" అని ఆజ్ఞాపించేడు.

ఆ మురికి బట్టలమూటను భుజానికి తగిలించుకొని, నెమ్మదిగా సూరీడు మెట్లుదిగి, వీధిగేటు దాటేసరికి - మళ్ళీ విద్యుత్ ప్రసారమాగిపోయింది !.... మళ్ళీ గాడాంధకారం అలము కుంది!.... అప్పుడామెకు శ్రీరాయప్రోలు సుబ్బారావుగారు "లలిత" అనే కావ్యంలో వ్రాసిన.........

"జగమను విచిత్ర నాటకశాలయందు
తరణి యస్తంగతుండైన తటి, విషాద
భరము సూపదించిన నీలితెర యనంగ
అంధకారం బలమె దిశాబంధురముగ." ....అనే

పద్యం ఆమె స్మృతిపథంలో మెదిలింది. ఆమెనేత్రాలు వర్షించిన అశ్రుబిందువుల్ని, భుజంపైనుండి జారిపడ్డ ఆమె పైట కొంగు పీల్చుకొని సంతృప్తమయింది!

[ఈ కథానిక 15-09-1984వ తేదీని, విశాఖపట్నం ఆకాశవాణి కేంద్రంనుండి ప్రసారమయింది ]

* * *